అటకెక్కిన నీటి నాణ్యత పరీక్షలు

- పలుచోట్ల పైపులైన్ల లీకేజీ
- కలుషిత నీరు తాగడంతో రోగాల బారినపడే అవకాశం
- అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

వర్షాకాలంలో మంచినీరు కలుషితంకావడంతోపాటు అంటు వ్యాధులు సైతం ప్రబలే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. నీటి పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ముందుకొచ్చింది. జలజీవన్ మిషన్ పథకం కింద పంచాయతీలకు కిట్లు అందజేసింది. వీటిని చాలా చోట్ల వాడకుండానే పక్కన పెట్టేశారు. రసాయనాలు, ఔషధాల కాలం చెల్లడంతో నిరుపయోగంగా మారాయి. ఫలితంగా నీటి పరీక్షలు చేయకుండానే కలుషిత నీటిని గ్రామీణ ప్రాంత ప్రజలు తాగుతూ రోగాల బారిన పడుతున్నారు.


తుమ్మనపల్లి గ్రామంలో వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు తీసుకెళ్తున్న ప్రజలు

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా గ్రామ పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లు సరఫరా చేసింది. వీటి ద్వారా నీటిని పరీక్ష విధానంపై మంచినీటి సహాయకులు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కిట్టులో నీటిని పరీక్షించేందుకు ఉపయోగించే రియోజెంట్ రసాయనం, రెండు గాజు నాళికలతో పాటు బ్రష్, పరీక్షించిన నీటిలో క్లోరిన్ శాతం ఎంత మోతాదులో ఉందో తెలుసుకునేందుకు చార్ట్ ఉంటాయి. ఒక గాజు నాళికలో ఐదు ఎంఎల్ నీటిని తీసుకొని అందులో నాలుగు చుక్కల రియోజెంట్ రసాయనం కలిపితే క్లోరిన్ ఎంత శాతం ఉందో తెలుస్తుంది. క్లోరిన్ 0.2 పీపీఎం నుంచి 1 పీపీఎం వరకు ఉంటే నీరు సురక్షితమైనది. కిట్ల ద్వారా ప్రతిరోజు మూడు విభాగాలుగా నీటి నాణ్యత పరీక్షలు చేయాలని సూచించారు. నీరు విడుదలయ్యే ట్యాంకుల వద్ద, గ్రామం మధ్యలోని కుళాయి వద్ద అలాగే చివరి నల్లా వద్ద పరీక్ష చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లోని తాగునీటి నీటి ట్యాంకుల్లో పరిమాణానికి అనుగుణంగా బ్లీచింగ్ పౌడర్ కలపాలని సూచించారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో మంచినీటి సహాయకులను నియమించి వారికి నీటి నాణ్యతా పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలకు రెండేళ్ల కిందట మలీంట నోకామీటరు, వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్ట్ కిట్లు వచ్చాయి. కిట్లు సరఫరా చేసిన అనంతరం వాడకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో చాలా చోట్ల మూలనపడేశారు.

ప్రశ్నార్థకంగా మంచినీటి కేంద్రాల పరిస్థితి

కరోనా ప్రభావంతో సకాలంలో కిట్లు అందించలేదు. ప్రజలు తాగేనీటిలో పీహెచ్, క్షారగుణం, ఇనుము తదితరవి ఎంత శాతం ఉన్నాయో గుర్తించేందుకు సాంకేతిక సహాయకులు పరీక్షలు చేయడం లేదు. నీటిని పరీక్షించి లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయడం లేదు. గ్రామాల్లోని మంచినీటి కేంద్రాల ద్వారా ప్రజలు నీటిని తీసుకెళ్తున్నారు. ఆ నీటి కేంద్రాల్లో నీటి నాణ్యత ఎలా ఉందో ప్రశ్నార్థకంగా మారింది. నాణ్యత లేని నీరు తాగుతూ ఎంతోమంది అనారోగ్యం బారినపడుతున్నారు. ఇటీవల వర్షాలకు ఎక్కడ చూసినా పారిశుధ్యలోపం కనిపిస్తోంది. మరోవైపు పైపులైన్ల లీకేజీలతో నీటి వనరులు, బోరుబావుల చుట్టూ మురుగు పేరుకుపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛమైన నీరు తాగాలి



గ్రామాల్లో నీటి నాణ్యతపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలి. మంచినీరు తాగకపోతే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి. స్వచ్ఛమైన నీరు తాగడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి.

– ప్రవీణ్, డాక్టర్, హుజూరాబాద్



ఇల్లందకుంట: ఇల్లందకుంటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నిర్వహణ లోపంతో నిఘా నేత్రాలు పనిచేయడం లేదని దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారు పోలీసుల నుంచి తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
క్రాంతికుమార్, ఎస్సై, ఇల్లందకుంట సెల్ నం. 87126 70778

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ


రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భీమ్‌రావు

హుజూరాబాద్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీసీపీ భీమ్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వాహనాలు, ప్రాపర్టీ, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదుదారులను మర్యాదగా రిసీవ్ చేసుకొని వారికి న్యాయం చేయాలని, అనుమానితులు, రౌడీలపై నిఘా పెట్టాలన్నారు. తనిఖీల్లో సీఐ కరుణాకర్, రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్‌ఐలు యూనస్ అహ్మద్ అలీ, రాధాకిషన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ


డీటీ ప్రణీత్‌ను సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

గన్నేరువరం: డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రణీత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డీటీ నర్సింహచారీ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు బోడ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో డీలర్లు ప్రణీత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రజినీశ్‌రెడ్డి, రఘు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనాథ్, చంద్రారెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు స్వప్న, పద్మ, బాలరాజు, స్వామి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై అధికారు ఆడిట్


ఆడిట్‌లో అధికారులు

మానకొండూర్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్ స్కూల్, కేజీబీవీలకు పీఎం సిరి 2024–25 విద్యా సంవత్సరానికి మంజూరైన నిధుల వినియోగంపై మండల వనరుల కేంద్రంలో మంగళవారం అధికారులు ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆడిటర్ కిషోర్ బాబు, ప్రసన్న, మండల విద్యాధికారి మధుసూదనాచారి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అంజి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: పట్టణ పరిధి బుడిగె జంగాల కాలనీలో మంగళవారం చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. పలువురికి బీపీ, షుగర్ టెస్టులు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. టీబీ, హెచ్‌ఐవీ, హెపటైటిస్ పరీక్షలు పూర్తిస్థాయిలో చేశామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధు, శశాంక్, హెచ్‌ఈవో విజేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న గరిగె శారద

కరీంనగర్: మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు వారికి కేటాయించిన రిజర్వేషన్లు అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి గరిగె శారద అన్నారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో కొట్టె అంజలి అధ్యక్షతన జరిగిన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమాజంలో మహిళలను చిన్న చూపు చూస్తున్నారని, రానున్న రోజుల్లో మహిళలే కీలకం కానున్నారని, వారికి కేటాయించిన అన్ని స్థాయిల రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకురాళ్లు బీర్ల పద్మ, భారతి, కదారి కావ్య, ఉప్పల శ్రీగుణ, నెల్ల మల్లీశ్వరి, బి.అర్చన, ఎస్.గంగప్రియ, టి.రేవతి, శ్రీలత, మంగ, నిర్మల, రజిత, జ్యోతి, సుజాత, లావణ్య, శంకరవ్వ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం


గోపాల్‌రావుపేటలో జాతీయ జెండా ఊరేగింపు


గన్నేరువరంలో....

గన్నేరువరం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం నిర్వహించారు. లయన్ శ్రీనివాస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ పతాక దినోత్సవంపై అవగాహన కల్పించి దేశ గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామయ్య, లయన్స్ కార్యదర్శి జీల ఎల్లయ్య, కోశాధికారి తేల్ల భాస్కర్, క్లబ్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీప్రగతి పాఠశాల విద్యార్థులతో వంద మీటర్ల జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మైక్రో కేబినెట్ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, కర్ర శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కర్ర రాజిరెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, శ్రీప్రగతి స్కూల్ కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ, హెచ్ఎం మావురం మునీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు


తెలంగాణ సాహితీ బాధ్యుల నివాళి

సాహిత్య యోధుడికి నివాళి

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా. రమేష్ అధ్యక్షతన తెలుగు విభాగాధిపతి డా. శ్యామల ఆధ్వర్యంలో మంగళవారం దాశరథి కృష్ణమాచార్య శత జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ ప్రజల్లో స్వాభిమానం రగిలించిన ఉద్యమకవి అని, ప్రజల కన్నీళ్లు అగ్నిధారగా మలిచి నిజాం పాలనను ఎండగట్టి , తెలంగాణ తల్లి విముక్తి కోసం పోరాడి, తెలంగాణ భావజాలాన్ని నలు దిశలా చాటిన సాహిత్య యోధుడు అని కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ ఓదెలుకుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం, స్టాఫ్‌సెక్రెటరీ గణేశ్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, మాధవి, ఉమాకిరణ్, రవిందర్, శ్రీనివాస్‌రెడ్డి, రవిప్రకాశ్, సుష్మ, మమత, శ్రీనివాస్, సాయికుమార్, ప్రశాంత్, అరుణ్‌రాజు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అసలు సిసలైన ప్రజాకవి దాశరథి

కరీంగనర్‌కల్చరల్: దాశరథి కృష్ణమాచార్యులు అసలైన ప్రజాకవి అని తెలంగాణ సాహితీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ అన్నారు. తెలంగాణ సాహితీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రేకుర్తిలోని తెలంగాణ సాహితీ కార్యాలయంలో దాశరథి చిత్రపటానికి నివాళి అర్పించారు. గౌరవాధ్యక్షుడు ఆడపు రామనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పురుషోత్తం సతీశ్, మానువాడ వనజ, కవులు వడ్డిక రాజశేఖర్‌రెడ్డి, బొమ్మ శ్రీనివాస్, సంపత్, బండారు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నాయకుడు నాగి శేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌గౌడ్, నాయకులు కరుణాకర్, మునీందర్, నర్సయ్య, పర్శారాం , మహేష్, అంజయ్య, శంకర్, సత్యం పాల్గొన్నారు.


పుస్తకాలు అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గన్నేరువరం: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సుధాకర్, లక్ష్మణ్, రవి, భూమయ్య, అనిల్, అజయ్, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

మనిషి చురుగ్గా ఉండాలి

కరీంనగర్‌టౌన్: మానవ శరీరంలో మెదడు అత్యంత ముఖ్యమైన భాగమని, మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే మనిషి చురుగ్గా ఉండాలని కరీంనగర్ మెడికవర్ వైద్యులు తెలిపారు. ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్ఐసీ కార్యాలయంలో మెదడు వ్యాధులపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ప్రపంచం డిజిటల్‌మయంగా మారిన తర్వాత బ్రెయిన్ స్ట్రోక్, డిమెన్షియా, అల్జీమర్స్ బ్రెయిన్ ట్యూమర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఉదయం నిద్ర లేవగానే విపరీతమైన తలనొప్పి వస్తే, మాట్లాడడంలో ఇబ్బంది ఉంటే బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. మొబైల్ వాడకాన్ని తగ్గించుకొని, కనీసం ఏడు గంటలు నిద్ర, రోజు గంట వ్యాయామం చేయాలని సూచించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి న్యూరోసర్జన్ రాజీవ్‌రెడ్డి, క్రిటికల్ కేర్ నిపుణులు ఉపేందర్‌రెడ్డి, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శివనాగప్రసాద్, నారాయణ, పెనుగొండ బసవేశ్వర్, విజ్ఞాన్‌రావు, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బుర్ర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్‌రెడ్డి

24న ఇంటర్వ్యూలు



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డా.రమేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో కంప్యూటర్ సైన్స్–1, డైరీ సైన్స్–1, క్రాఫ్ ప్రొడక్షన్ -1, బాటనీ-1 ఖాళీలు ఉన్నాయని, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుదని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11గంటలకు అభ్యర్థులు నేరుగా హాజరు కావాలని పేర్కొన్నారు.

మాక్ పోలింగ్



గంగాధర: మండలంలోని రంగారావుపల్లి ఎస్సార్ ప్రైమ్ స్కూల్‌లో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికలు, ప్రజాస్వామ్య విలువలు, వ్యవస్థలు నడిచే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం బోనాల వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాలల జోనల్ ఇన్‌చార్జి శశిధర్, స్కూల్, కాలేజీ డీన్ రవీందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరోజు శాస్త్రవేత్త కార్యక్రమానికి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీపాఠశాల విద్యార్థులు ఒక రోజు శాస్త్రవేత్త కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో ఒక రోజు శాస్త్రవేత్త కార్యక్రమం నిర్వహిస్తున్నారని సైన్స్ ఉపాధ్యాయుడు బి ఓదెలుకుమార్ మంగళవారం తెలిపారు. దేశంలోని 37 సీఎస్ఐఆర్‌లలో విద్యార్థులకు నిర్వహించే క్విజ్ పోటీలలో దాదాపు వంద మంది పాల్గొంటారని, కార్యక్రమానికి సాహిత, అక్షయ హావిశ్, స్వప్న, సుస్మిత, సాయివర్షిత, రమాదేవి, మహాళి, నెల్సి, మనఃమహావీర్ ఎంపికయ్యారని, 24న కలకత్తాలోని సీఎస్ఐఆర్‌లో నిర్వహించే ప్రయోగశాలలకు హాజరవుతారని వివరించారు. విద్యార్థులను హెచ్ఎంలు జయప్రద, తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పోచమ్మ బోనాలు



చిగురుమామిడి: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు హై స్కూల్ విద్యార్థులు మంగళవారం బోనాల వేడుకలు నిర్వహించారు. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం కె. సమ్మిరెడ్డి, కె. దమయంతి, ఉపాధ్యాయులు బి. సతీష్, బి. రమేశ్, ఏ స్వప్న, ఎన్. భాగ్యలక్ష్మి, పి. జ్యోతి, జి. వసంత, జి. మౌనిక, ఎస్ చామంతి, గీత, శ్రీలత, అరుణ, మల్లికా, సుస్మిత, సఫియా పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడం లేదు

వీణవంక: ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడం లేద బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేల సైకిళ్లను విద్యార్థులకు అందించనున్నామని, విద్యార్థులకు రవాణా భారం తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నరసింహారాజు, గొట్టిముక్కుల సంపత్‌రావు, ఆదిరెడ్డి, వినోద్, లింగారెడ్డి, ముత్యాల రవీందర్, భాస్కర్, వెంకటేశ్, నాగరాజు, శ్రీనివాస్, నాని ఉన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బీజేపీ నాయకులు సైకిళ్లు పంపిణీ చేశారు.

ఇల్లందకుంట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కానుకగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఇల్లందకుంటలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల విద్యాధికారి రాములునాయక్, పార్టీ నాయకులతో కలిసి సైకిళ్లు పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న దాదాపు ఇరవై వేల మంది విద్యార్థులకు సంజయ్‌కుమార్ సైకిళ్లు అందజేస్తామనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కటంగూరి అనిల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బై రెడ్డి రమణారెడ్డి, నాయకులు ఉప్పుల రమేష్, రాంబాబు, కంకణాల రవీందర్‌రెడ్డి, కంకణాల సురేందర్‌రెడ్డి, నల్ల లింగారెడ్డి, శ్రీధర్, పవన్‌రెడ్డి, మురహరి గోపాల్, శ్రీకాంత్, సాయిప్రసాద్‌రెడ్డి, భద్రయ్య, రాములు పాల్గొన్నారు.


సైకిళ్లు పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి

విచారణ చేయలేదని దిష్టిబొమ్మ దహనం

శంకరపట్నం: కేశవపట్నంలో మంగళవారం డీపీవో జగదీశ్ దిష్టిబొమ్మను తెలంగాణ జనసమితి, సీపీఐ నాయకులు దహనం చేశారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో సర్వేనంబర్ 703 ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రేకుల షెడ్డు వేసుకున్నారని, ఎనిమిది నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే డీపీవో క్షేత్రస్థాయిలో విచారణ చేయలేదని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మోరె గణేశ్ ఆరోపించారు. భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇంటి స్థలాల కోసం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, టీజేఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


డీపీవో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గెలుపే లక్ష్యం సాగాలి

గన్నేరువరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 24న గన్నేరువరంలో నిర్వహించే మండలస్థాయి సమావేశానికి అన్ని గ్రామాల నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసే ఆశావహులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. అనంతరం ఎస్సై నరేందర్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్‌వర్మ, చంద్రారెడ్డి, రామచంద్రం, రాము, తిరుపతి, రామచంద్రం , అంజయ్య, అనంతరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

జమ్మికుంట: పట్టణంలోని శాలవాడకు చెందిన సిలువేరు రమ హెయిర్ డై తాగి, నాయిని చెరువులో దూకింది. పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళను చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కుటుంబ కలహాలే కారణమని కాలనీవాసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

వీణవంక: మండలంలోని చల్లూరు శివారు గొల్లపల్లికి చెందిన ఎనగంటి చంద్రయ్య(53) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇటీవల పురుగుమందు తాగాడు. చంద్రయ్య భార్య పద్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి వివరించారు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య...

ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి చుక్క ఆదిత్య(15) చికిత్స పొందుతూ మృతిచెందాడు. చుక్క సదయ్య కుమారుడు ఆదిత్య పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదని ఇటీవల పురుగు మందు తాగాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు.

హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

శంకరపట్నం: గుడాటిపల్లెకు చెందిన గుర్రం సంజీవరెడ్డి మంగళవారం మానవహక్కుల కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. భూ సమస్యలతో సింగిరెడ్డి పెద్దమల్లారెడ్డితో పాటు కుమారులు దాడి చేయగా మూడు నెలలు మంచానికే పరిమితమయ్యానని, వైద్యానికి రూ.ఐదులక్షలు ఖర్చు అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పైప్‌లైన్ ధ్వంసం, భూమి చుట్టూ కంచె తొలగింపు, ఇంట్లోని చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల మానవహక్కుల కమిషనర్‌కు గుర్రం సంజీవరెడ్డిపై ఫిర్యాదు చేశారు.